క్లుప్తంగా

సబ్ జైలులో వైద్య శిబిరం



శిబిరంలో వైద్య సిబ్బంది

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సబ్ జైలులో ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి ఐసీటీసీ సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అండర్ ట్రయల్ ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హెచ్ఐవీ, టీబీ, సుఖవ్యాధులు, ఇతర సంబంధిత వ్యాధులపై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత ను పాటించాలని, ఏమైనా ఇబ్బందులు, వ్యా.దులు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాస్, జైలర్ స్వామి, వైద్య సిబ్బంది అనిల్‌కుమార్, ఆంజ నేయులు, ల్యాబ్ టెక్నిషియన్‌లు పాల్గొన్నారు.

దొనబండలో గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్



వ్యాక్సిన్ వేస్తున్న రమేశ్‌కుమార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖా ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు ఉచితంగా పీపీఆర్ వ్యాక్సినేషన్ చేశారు. ఈ సమయంలో మేకలు, గొర్రెలలో వచ్చే వ్యాధులకు సంబంధించి జరుపుతున్న వ్యాక్సినేషన్‌లో భాగంగా గ్రామంలోని 1,424గొర్రెలు, 262మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖా అధికారి డాక్టర్ వై.రమేశ్ కుమార్, మండల పశువైద్యాధికారి ఈ.సరిత, వెటర్నరీ అసిస్టెంట్‌లు స్వప్న, రాకేశ్, గొర్రెలు, మేకల యజమానులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో గురువారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్‌స్థాయి ఖోఖో, కుస్తీ క్రీడా పోటీల్లో కళాశాలకు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ గౌతం రెడ్డి తెలిపారు. 200 మంది క్రీడాకారులు పాల్గొని, కళాశాల విద్యార్థులు ఉత్తమ ఖోఖో, కుస్తీ పోటీలో ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈ క్రీడాకారులు త్వరలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో క్రీడా కార్యదర్శి బాబురావు, పీడీ మల్లిక, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఓటరు అవగాహన కార్యక్రమం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అంజయ్య మాట్లాడుతూ... 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సోమయ్య, అధ్యాపకులు, అంబాసీడర్స్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి

పాతమంచిర్యాల: గోదావరి ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని, ముంపు వల్ల జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి.బాబన్న అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ జనసమితి పార్టీ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించిందని తెలిపారు. కడెం ప్రాజెక్టుపై కుఫీ రిజర్వాయర్ చేయాలని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలని, మంచిర్యాల జిల్లాకు సాగు నీరందించాలని అండర్‌గ్రౌండ్ బొగ్గు గనులు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రెడ్డి, విద్యార్థి యువజన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్.. పరేషాన్!

- ఇరుకు రోడ్లపైనే వాహనాలు
- ఇబ్బంది పడుతున్న మండలవాసులు
- అధికారులు దృష్టి సారించాలని వేడుకోలు



ప్రధాన రోడ్డుపై నిలిపిన వాహనాలు



రోడ్డుపైనే అరటి పండ్ల బండి

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో జనాభాకు అనుగుణంగా వ్యాపారం సాగించేందుకు గతంలో మార్కెట్‌కు స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం గతంలో కంటే ఎన్నో రెట్లు జనాభా పెరగడంతో పాటు వ్యాపారాలు కూడా పెరిగాయి. దీంతో మార్కెట్‌లో నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే మార్కెట్‌కు వచ్చే వాహనదారులు పార్కింగ్ స్థలం లేకపోవడంతో తిప్పలు పడుతున్నారు. పాన్, కిరాణా, హోటళ్లు, బట్టల దుకాణాల ముందు వ్యాపారులు, కస్టమర్లు తమ వాహనాలు నిలుపుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

ప్రధాన రోడ్డుపైనే వాహనాలు

మండల కేంద్రంలోని పెద్దవాగుపై నిర్మించిన వంతెనపై ద్విచక్ర వాహనాలు నిత్యం నిలుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆటోలకు మండలకేంద్రంలో స్టాండ్‌లు లేకపోవడంతో దుకాణాలు, ప్రధానరోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. కాగా కొన్ని తిను బండారాలకు సంబంధించిన వ్యాపారాలు ప్రధాన రోడ్డు మీదనే కొనసాగుతుండడం.. రాకపోకలు సాగించే వాహనాల దుమ్ము వాటిపై పడుతుండడంతో అవి తిన్న వారికి రోగాలు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చాలా కాలంగా పార్కింగ్ సమస్య ఉన్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం



పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం. వారసంత రోజు ప్రజలు ఇబ్బందులు పడకుండా వాహనాల నిలుపుదలకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం.

– మహేందర్, ఎంపీడీవో

వారసంత రోజు మరింత కష్టం

మండల కేంద్రంలో ఆదివారం వారసంత కావడంతో ఆ రోజు ఇతర ప్రాంతాల వ్యాపారులు వచ్చి దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ క్రమంలో అనేక ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు వెళ్లడానికి దారి కూడా లేకుండా పోతోంది.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



కెరమెరి: మహాసభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఈనెల 11న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభకు సంబంధించిన పోస్టర్లను గురువారం గోలేటిలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు మాదిగలు, ఉపకులాలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటున్నాయన్నారు. ఎన్నికలకు ముందు వర్గీకరణకు అనుకూలమని, గద్దెనెక్కిన తరువాత వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. 11వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించబోయే విశ్వరూప మహాసభకు ముఖ్యఅతిథిగా ప్రధాని నరేంద్రమోడీ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మాదిగలు, ఉపకులాలు అధిక సంఖ్యలో మహాసభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు రాజేందర్, జనార్దన్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లయ్య పాల్గొన్నారు.

కెరమెరి: హైదరాబాద్‌లో ఈ నెల 11న నిర్వహించే 'విశ్వరూప మహాసభ'ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం దశాద్దాలుగా పోరాటం చేస్తున్నప్పటికి ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. సభకు అధిక సంఖ్యలో మాదిగ ఉపకులాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సంతోష్, కంబాల వినేష్, సాయి, నరేష్, లక్ష్మి, లలిత తదితరులు ఉన్నారు.

'బండి' సభను జయప్రదం చేయండి



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న హరీశ్‌బాబు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించనున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బహిరంగసభను నియోజకవర్గ ప్రజలు విజయవంతం చేయాలని సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. గురువారం స్థానిక గొల్లవాడ కాలనీలోని బహిరంగ సభ స్థలం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు బండి సంజయ్ బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభ అనంతరం స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తానని తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు నీరటి సత్యనారాయణ, కొంగ సత్యనారాయణ, ఎల్ములే శంకర్, నులిగొండ మహేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలి

కౌటాల: సిర్పూర్ మండల కేంద్రంలో నేడు నిర్వహించనున్న విజయ సంకల్ప బహిరంగ సభను బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక గొల్లవాడలో బీజేపీ విజయ సంకల్ప బహిరంగ సభ నిర్వహిస్తామని, సభకు బీజేపీ నేత, ఎంపీ బండి సంజయ్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట నాయకులు మధుకర్, రవి, చందు, మృత్యుంజయ్, కవిరాజ్, విజయ్ తదితరులు ఉన్నారు.

బెల్టు దుకాణాలు, గుడుంబా స్థావరాలపై దాడులు




స్వాధీనం చేసుకున్న మద్యంతో అధికారులు

దహెగాం: ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు బెల్టు దుకాణాలు, గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నారు. గురువారం జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంతో పాటు దేవులగూడ, కమ్మర్‌పల్లి గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బండ సాగర్ వద్ద అక్రమంగా విక్రయించడానికి నిల్వ ఉంచిన మద్యం లభించిందన్నారు. మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి, దేవులగూడెం శివారులో 2500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని పేర్కొన్నారు. మద్యం విక్రయించినా, గుడుంబా తయారు చేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'పది' విద్యార్థులకు అభ్యాస దీపికలు

మంచిర్యాలఅర్బన్: పదిలో శతశాతం పెంపు లక్ష్యంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా బుధవారం మరోవైపు అభ్యాసన దీపికలు పంపిణీ చేశారు. ఆయా ఎమ్మార్సీలకు అభ్యాస దీపికల పుస్తకాలు చేరగా హెచ్ఎలకు అందజేశారు. జిల్లాలో 129పాఠశాలల్లో 12,065మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఒక్కో విద్యార్థికి గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక, జీవ, భౌతిక శాస్త్రాల సబ్జెక్టులకు సంబంధించి అభ్యాస దీపికలు అందజేయనున్నారు. వీటిలో మాదిరి ప్రశ్నపత్రాలతో పరీక్షలకు సంసిద్ధులను చేస్తున్నారు. లఘు, వ్యాసరూప, బహుళ, ఐచ్చిక ప్రశ్నలు, జవాబులు రూపొందించారు. వందశాతం ఫలితాలకు పది విద్యార్థులకు అభ్యసన దీపికలు ఎంతో దోహదం చేస్తాయని ఎంఈవో పోచయ్య తెలిపారు.

పంటల రక్షణకు పాట్లు



రాత్రిపూట కాపలా కోసం ఏర్పాటు చేసిన మంచె



పత్తి చేను చుట్టూ వేసిన కంచె

పెంచికల్‌పేట్: వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి, పత్తి పంటలు చేతికొచ్చే సమయంలో అడవి పందులు పంటలపై దాడులు చేస్తూ తీవ్ర నష్టాలు కలిగిస్తున్నాయి. అటవీ జంతువుల నుంచి పంటలను రక్షించుకోవడానికి అన్నదాతలు పంట చేల చుట్టూ వలలు, చీరలను కంచెలుగా ఏర్పాటు చేస్తున్నారు. మంచెలపై రాత్రివేళ పంటల రక్షణకు కాపలా ఉంటున్నారు.

షీటీం సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి సునీత

రెబ్బెన: బాలికలు, మహిళల రక్షణ కోసం పని చేస్తున్న షీటీం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ షీ టీం ఇన్‌చార్జి సునీత అన్నారు. ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని అన్నపూర్ణ హైస్కూల్‌లో విద్యార్థులకు షీటీంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసమే ప్రభుత్వం షీటీంను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కళాశాలలకు, పాఠశాలలకు, ఆఫీసులకు వెళ్లే సమయంలో మహిళలు, విద్యార్థినులు ఈవ్‌టీజింగ్‌కు గురైతే వెంటనే షీటీంకు సమాచారం అందించి తక్షణ సహాయం పొందవచ్చన్నారు. అదే తరహాలో విద్యార్థినులపై, మహిళలపై హింస, సైబర్ క్రైంలకు గురి చేసిన వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. అత్యవసర సమయంలో తక్షణ సహాయం కోసం ఏర్పాటు చేసిన డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, సుదర్శన్‌గౌడ్, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు స్వప్న, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న 4 నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్లను బీఎల్‌వోలుగా ఎన్నికల విధులకు వినియోగిస్తున్నారని, కానీ వేతనాలు మాత్రం సకాలంలో ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా మే నెల నుంచి రూ.వెయ్యి పెంచుతూ రూ.9,500వరకు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు చెల్లించకుండా కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సంఘం అధ్యక్షుడు మాట్లరాజు, నాయకులు సమ్మయ్య, లక్ష్మి, సాగర్, రాజు, ఇస్తారి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న సంఘ సభ్యులు

కెరమెరి: బ్యాంకు, స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సీసీ శంకర్, సీఆర్‌పీ శ్యామల అన్నారు. గురువారం మండలంలోని కెస్లాగూడలో బాబా వీవో, ఎస్‌హెచ్‌జీ సంఘ సభ్యులకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా మరిన్ని రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే గ్రూపులో పొదుపులు అధికంగా చేయాలని పేర్కొన్నారు.

పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్

తాండూర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా త్వరలో జరిగే పోలింగ్ సజావుగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అధికారులకు సూచించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీని గురువారం సందర్శించారు. ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ రోజు వచ్చే అధికారులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని, ఎన్నికల రోజు ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఎంపీడీవో వెంట కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

ఆఖిరు మజిలీకి కష్టాలు!

- నిరుపయోగంగా శ్మశానవాటిక
- కనీస సౌకర్యాలు కరువు



జిల్లా కేంద్రంలో నిరుపయోగంగా శ్మశానవాటిక

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో పెద్దవాగు నదీ తీరాన గతంలో నిర్మించిన శ్మశానవాటిక నిరుపయోగంగా మారింది. ప్రభుత్వం దహన సంస్కారాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రతీ గ్రామంలో శ్మశానవాటికలు నిర్మించింది. కానీ జిల్లా కేంద్రంలో నిర్మించిన శ్మశానవాటిక మాత్రం కనీస సౌకర్యాలకు కూడా నోచుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

మూడు కాలాలు ఇబ్బందులే..

మూడు కాలాలు దహన సంస్కారాలకు జిల్లా కేంద్రంలోని ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా కేంద్రంలో సుమారు 40వేలకు పైగా ఉన్న జనాభాకు కనీసం నాలుగు ప్రాంతాల్లో శ్మశానవాటికలు నిర్మించాలన్న డిమాండ్ ఉంది. కానీ ప్రభుత్వం కేవలం ఒక్క శ్మశానవాటిక నిర్మాణం చేపట్టింది. అది కూడా అరకొర వసతులతో ఉండడంతో వాగులు, వంకలు, ఒర్రెల సమీపంలో దహన సంస్కారాలు చేస్తున్నారు. అకస్మాత్తుగా వాగులు పొంగితే దహనసంస్కారాలతో పాటు జరగాల్సిన ఇతర కార్యక్రమాలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవచూపి శ్మశానవాటికలో అన్ని వసతులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు కల్పించాలి. వసతులు లేక శ్మశానవాటిక నిరుపయోగంగా మారింది. విద్యుత్, నీటి సౌకర్యంతో పాటు సరైన రహదారి నిర్మించాలి. మరో మూడు శ్మశానవాటికలను వేర్వేరు ప్రాంతాల్లో నిర్మించాలి.

– పిన్నా మహేశ్, స్థానికుడు

ఇబ్బంది పడుతున్నాం



జిల్లా కేంద్రంలోని శ్మశానవాటిక నిరుపయోగంగా మారడంతో దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్నాం. జిల్లాకేంద్రంలో మూడు శ్మశానవాటికలు అవసరమున్నాయి. కానీ ఒకటి మాత్రమే నిర్మించారు. నిర్మించి మూడేళ్లయినా సౌకర్యాలు మాత్రం కల్పించలేదు.

– మంథెన రవీందర్, స్థానికుడు

త్వరలో వసతులు కల్పిస్తాం

మండలంలో ఇప్పటి వరకు ఉన్న 27 జీపీల్లో శ్మశానవాటికలు నిర్మించాం. ఎన్నికలు పూర్తయిన వెంటనే అసంపూర్తిగా ఉన్న ఆసిఫాబాద్‌లోని శ్మశానవాటికలో పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తాం. గొడవెల్లి శివారులో మరో శ్మశానవాటిక ఏర్పాటుకు కూడా ప్రణాళికలను ఉన్నతాధికారులకు నివేదించాం. – ప్రసాద్, ఎంపీవో, ఆసిఫాబాద్

సర్వసభ్య సమావేశం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఈ నెల 10న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.